# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- క్రీడలతోనే సామాజిక ఐక్యత సాధ్యపడుతుందని మంత్రి ఎం. రామప్రసాద్ రెడ్డి అన్నారు.
- నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రేపు తీరాన్నిదాటే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది.
- భారీ వర్షాల నేపథ్యంలో పరిస్థితులను ఆర్టీజీఎస్ నిరంతర పర్యవేక్షణ చేస్తుందని సీఈఓ కె. దినేష్ కుమార్ తెలిపారు.
- వాయుగుండం ప్రభావంతో ఏర్పడిన పరిస్థితులను ఎదుర్కొవడానికి అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

===========================

రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో ఈ రోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పారిశ్రామిక విధానాన్ని రూపొంధించాలని నిర్ణయించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాలో వేసేలా కొత్త విధానాన్నిఅమలు చేయాలని తీర్మానించారు. 2030 నాటికి ఇంటికో పారిశ్రామికవేత్త అంశంతో ఎంఎస్ఎంఈ పాలసీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలను ప్రోత్సహించేలా నూతన పారిశ్రామిక విధానం ఉండాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఆ వివరాలను అమరావతిలోని సచివాలయంలో పాత్రికేయులకు ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

===========================

సమాజంలో అందరినీ ఒక్కటిగా చేసేది క్రీడలేనని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఈశా ఫౌండేషన్ 16వ గ్రామోత్సవం వేడుకలకు సంబందించిన గోడ పత్రికను అమరావతిలోని సచివాలయంలో మంత్రి ఈ రోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... క్రీడలతో ఆరోగ్యం పాటు వ్యసనాలు దరి చేరని జీవనశైలి అలవడుతుందని తెలిపారు. ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని, ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాన్ని క్రీడలు కల్పిస్తాయని మంత్రి పేర్కొన్నారు.

===========================

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రేపు తీరం దాటే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ వాయువ్య దిశగా పయనిస్తూ.. ఉత్తర తమిళనాడు - దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల మధ్య వున్న పుదుచ్చేరి నెల్లూరు మధ్య రేపు తెల్లవారుజామున చెన్నైకి దగ్గరగా తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారిణి తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

వర్షాల వల్ల బాధితులకు ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తినా తక్షణం పరిష్కరించేలా పని చేయాలని ఆర్టీజీఎస్ సీఈఓ కె. దినేష్ కుమార్ సిబ్బందికి సూచించారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్టీజీఎస్ చేపట్టిన ఏర్పాట్లను ఈ రోజు ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధానంగా వాయుగుండం తీరం దాటే సమయంలో తీర ప్రాంతాల్లో వర్షాలు అధికంగా ఉంటాయని సిబ్బందికి గుర్తు చేశారు. అందువల్ల తీర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై ప్రత్యేక పర్యవేక్షణ పెట్టాలన్నారు. వర్షాలు తగ్గిపోయి పరిస్థితులు మళ్లీ యదాస్థితికి వచ్చేంతవరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా, వర్షాలు అధికంగా కురిసే అవకాశమున్న జిల్లాల్లో మొత్తం 4,845 నిఘా కెమెరాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. వీటి ద్వారా అక్కడ పరిస్థితిని ఆర్టీజీఎస్ నుంచి ప్రత్యక్షంగా సమీక్షిస్తున్నామని ఆయన తెలిపారు.

===========================

అల్పపీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలలో అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. అల్పపీడన ప్రభావంతో ఈనెల 18వ తేదీ వరకు తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న.. ముందస్తు సమాచారంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉందని పేర్కొన్నారు. అల్పపీడనం నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేసి పునరావస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లుగా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. మరో 48 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆ జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు.

===========================

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో తిరుపతి నుంచి తమిళనాడు రాష్ట్రం మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతి - చెన్నై సెంట్రల్ తిరుపతి ఎక్స్ ప్రెస్, తిరుపతి - చామరాజనగర్ కాట్పాడి మీదుగా కర్ణాటక రాష్ట్రానికి వెళ్లే రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశామని ఆప్రకటనలో పేర్కొంది.

విరామం

===========================

మంచి ఆహారాన్ని తీసుకోడం ద్వారానే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమని బాపట్ల, ఒంగోలు, కడప, అన్నమయ్య జిల్లాల ఆహార భద్రత అధికారి ప్రభాకర్ రావు అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా బాపట్లలోని స్థానికంగా వున్న దుకాణ దారులతో ఆయన ఈ రోజు అవగాహనా సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ... మెరుగైన జీవితం- మంచి భవిష్యత్ కోసం, స్వచ్ఛమైన ఆహారం మనందరి హక్కు అనే అంశాల పై అవగాహనా సదస్సు నిర్వహించామన్నారు.

===========================

అల్పపీడన ప్రభావంతో పాటు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పల్నాడు జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద నీరు వస్తోందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. దీంతో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ లోని 4 గేట్ల నుండి 32 వేల 400 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామని అధికారులు పేర్కొన్నారు.

===========================

విజయనగరం జిల్లా గుర్ల మండలంలో అతిసార వ్యాధి అదుపులో ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఈ రోజు గుర్ల గ్రామంలో పర్యటించిన ఆయన స్థానికంగా వైద్యం పొందుతున్న రోగులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పాత్రికేయులతో కలెక్టర్ మాట్లాడుతూ... అతిసారం గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అతిసారం వల్ల కాకుండా వేర్వేరు కారణాలతో నిన్న నలుగురు మృతి చెందినట్లుగా వారి కుటుంబ సభ్యులు చెప్పారని వెల్లడించారు. కాగా, ఇంటింటికి క్లోరినేటెడ్ నీటిని సరఫరా చేస్తున్నామని, గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు.

===========================

కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం నాగేశ్వరావుపేట గ్రామంలో ఈ రోజు జరిగిన పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ సచివాలయం, 5 అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు 4 వేల 500 కోట్ల రూపాయలు కేటాయించడం మంచి పరిణామమని తెలిపారు. కాగా, పెడన నియోజకవర్గంలో 20 కోట్ల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణం, డ్రైన్లు అభివృద్ధి పనులను జనవరి నాటికి పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

===========================

కర్నూలులోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం పీజీ కోర్సులలో కన్వీనర్ కోటాలో స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. లోకనాథ తెలిపారు. రేపటి నుండి ఈ నెల 24వ తేదీ వరకు విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో యూనివర్సిటీ కార్యాలయానికి హాజరై నిబంధనల ప్రకారం అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు.

===========================

శ్రీకాకుళం జిల్లా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన ప్రణాళికలను అమలు చేస్తున్నామని శ్రీకాకుళం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కేవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. శ్రీకాకుళంలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, ఒడిశా - ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి పంట పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారని అన్నారు. దీన్ని నివారించేందుకు సరిహద్దు ప్రాంతాలైన గంజాం, రాయగడ, కోరాపుట్, గజపతి జిల్లాల పరిధిలో ఉన్న పోలీస్ అధికారులతో కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని ఆయన తెలిపారు.

===========================

వాల్మీకి జయంతిని చిత్తూరు జిల్లాలో రేపు ఘనంగా నిర్వహిస్తు న్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి రబ్బానీ బాష ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సచివాలయంలో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

==============================

"పల్లె పండుగ" కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్టు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. జిల్లాలోని అత్తిలి మండలం వరదలపాలెం గ్రామంలో కోటి పది లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైనేజీల పనులకు తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి ఈ రోజు ఆమె భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో ఉపాధి హామీ పథకం నిధులు ప్రధాన పాత్ర వహిస్తున్నాయని అన్నారు.

==============================

తిరుమల శ్రీవారి ఆలయంలో రేపు పౌర్ణమి గరుడసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు.

==============================
==============================